సాక్షి
నారాయణపేట
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



ఎదురుచూపులే..
ప్రభుత్వ శాఖల్లోని అద్దె వాహనాల బిల్లుల కోసం వాహనదారులు ఎదురుచూస్తున్నారు.
వివరాలు 8లో ▸



సహాయక చర్యలు
సొరంగంలో కార్మికుల కోసం సహాయక చర్యలు వేగవంతం చేశారు.
వివరాలు 8లో ▸



వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

కోస్గి రూరల్: పదో తరగతి పూర్తయిన విద్యార్థులు డిప్లొమా కోర్సుల్లో చేరాలని, కోస్గిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసులు అన్నారు. ఈమేరకు గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. టీజీ పాలిసెట్- 2025 పరీక్ష కేంద్రంగా కోస్గి కళాశాల ఎంపిక కావడంతో సమీప ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఆయా వృత్తి విద్య కోర్సుల్లో చేరాలని, ఎంట్రెన్స్ కేంద్రాన్ని సైతం కోస్గిని ఎంచుకోవాలని తెలిపారు. ఈ నెల 23తో పాలిసెట్ దరఖాస్తు గడువు ముగుస్తుందని, మే 13న పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ బీసీ యువతకు స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ అధికారి మైత్రి ప్రియ గురువారంఒ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 12వ తేదీన ఉమ్మడి జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 040-29303130 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇటీవల పాఠశాలల్లో ఏఐ ఆధారిత కంప్యూటర్‌లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని, వాటిని కూడా విద్యార్థులకు పూర్తిస్థాయిలో వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు చక్రవర్తి గౌడ్, గిరిజారమణ, బాలుయాదవ్, దుంకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామికి రూ.9.9 లక్షల ఆదాయం



చిన్నచింతకుంట: పాలమూరు ప్రజల ఆరాధ్య దైవం, అమ్మాపురం కురుమూర్తిస్వామి హుండీని అధికారులు గురువారం లెక్కించారు. అమావాస్య, శని, సోమవారాల సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు స్వామి వారికి కానుకలు సమర్పించారు. హుండీ లెక్కించగా.. రూ.9,90,934 నగదు వచ్చినట్లు ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు భారతమ్మ, ఉంద్యాల శేఖర్, కమలాకర్, భాస్కర చారి, పి.నాగరాజు, అర్చకులు వెంకటయ్య, సత్యనారాయన, అనంత విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నూతన బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు: మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో నూతనంగా రెండుబార్లు ఏర్పాటు చేస్తున్నామని, ఆసక్తి కలిగిన వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఎస్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీఐ వీరారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష డీడీతో పాటు ఇతర పత్రాలను జతచేసి ఈనెల 26 వరకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈనెల 29న ఉదయం 11గంటలకు మహబూబ్‌నగర్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో నూతన లైసెన్స్‌దారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బార్ వచ్చిన లైసెన్స్‌దారుడు మహబూబ్‌నగర్‌లో ఏడాదికి బార్ ఎక్సైజ్ పన్ను రూ.42 లక్షలు, మక్తల్ లైసెన్స్‌దారుడు ఏడాదికి రూ.30 లక్షలు పన్ను నాలుగు దశల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ 9 బార్లు, నారాయణపేటలో మూడు బార్లు ఉండగా కొత్తగా రెండు బార్లతో ఆ సంఖ్య 14కు చేరుకోనుంది.

కర్షకుల కథ.. కన్నీటి వ్యథ

వారంతా కర్షకులు.. పొద్దున్నే లేచి వ్యవసాయ పనులకు వెళ్లి పొట్ట నింపుకోవడం వారి దినచర్య. గురువారం సైతం యథావిధిగా వారివారి పనులకు వెళ్లిపోయారు. అయితే వీరిని విధి చిన్నచూపు చూసింది.. కరెంట్ రూపంలో ముగ్గురు రైతులు.. పిడుగు రూపంలో మరో ఇద్దరు కూలీలతోపాటు.. గేదెలు మేపేందుకు వెళ్లిన మరో ఇద్దరిని బలి తీసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విషాదం నింపిన ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

పొట్టకూటి కోసం వెళ్లి ఏడుగురి మృత్యువాత

- పంటలకు నీరు పారించేందుకు వెళ్లిన ముగ్గురు రైతులను బలి తీసుకున్న కరెంటు
- ఇద్దరు కూలీలను కాటేసిన పిడుగు
- గేదెలు మేపేందుకు వెళ్లి మరో ఇద్దరు..
- ఉమ్మడి జిల్లాలో విషాదం నింపిన వేర్వేరు ఘటనలు



బోరు మోటారు సరిచేస్తుండగా ఇద్దరు యువ రైతులు..



అచ్చంపేట ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

అచ్చంపేట రూరల్: వ్యవసాయ పొలంలోని పాంపాండ్‌లో ఉన్న బోరు మోటారును సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువరైతులు మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని చేదురుబావితండాకు చెందిన కాట్రావత్ లోక అలియాస్ లోకేష్(30) తన వ్యవసాయ పొలంలో (పాంపాండ్) బోరు మోటారు రెండు రోజుల నుంచి పనిచేయడం లేదు. దీంతో సమీప పొలంలోని ముడావత్ కుమార్(28) విషయం చెప్పి బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సాయంగా తీసుకెళ్లాడు. బోరు మోటారు సరి చేస్తుండగా.. ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఇద్దరు యువ రైతులు పొలం వద్ద మృతి చెందిన సంఘటన ఎవరికీ తెలియదు. బుధవారం సాయంత్రం అయినా ఇళ్లకు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు.. అర్ధరాత్రి వరకు ఇద్దరికి ఫోన్ చేయగా రింగ్ అయినప్పటికీ ఎత్తలేదు. దీంతో కుటుంబసభ్యులు, తండావాసులు తండా, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో లోకేష్ పొలం వద్ద ఓ చెట్టు కింద బైక్‌ను గమనించారు. అక్కడికి వెళ్లిన కొందరు ఫోన్ చేయగా పాంపాండ్ వద్ద సెల్‌ఫోన్ రింగ్ కాగా అక్కడికి వెళ్లి చూడగా ఇద్దరూ శవమై కనిపించారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పాంపాండ్ నుంచి ఇద్దరి మృతదేహాలను తండాకు తరలించారు. ఈ ఘటనపై లోక తండ్రి హన్యా ఫిర్యాదు మేరకు సిద్ధాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లోకకు భార్య సరితతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే కుమార్‌కు భార్య వినోజితో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పలువురు నాయకులు పరామర్శించారు.



లోకేష్ (ఫైల్)



కుమార్(ఫైల్)

సూరాపూర్‌లో మరో రైతు..



పర్వతాలు (ఫైల్)

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని సూరాపూర్‌కు చెందిన రైతు దేశ పర్వతాలు(40) విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తన సొంత వ్యవసాయ పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటకు నీరు పెట్టడానికి గురువారం తెల్లవారుజామున పొలం దగ్గరకు వెళ్లాడు. అయితే బోరు మోటార్ ఆన్ చేసే సమయంలో స్టార్టర్ దగ్గర తేలి ఉన్న వైరు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. పర్వతాలుకు భార్య చిట్టెమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పిడుగు పడి ఇద్దరు కూలీలు..

అచ్చంపేట: పదర గ్రామ శివారులో **గురువారం మ**ధ్యాహ్నం పిడుగు పడి **ఇద్దరు మహిళా** కూలీలు అక్కడికక్కడే **మృతిచెందగా** మరొకరు తీవ్రంగా **గాయపడ్డారు.** వివరాల్లోకి వెళ్తే.. నాగ**ర్‌కర్నూల్ జిల్లా** పదర మండలం కోడోనిపల్లి గ్రామానికి చెందిన 10 మంది కూలీలు పదర గ్రామానికి చెందిన రైతు పోగుల వినోద్ పొలంలో వేరుశనగ పంట తీసేందుకు వచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో కూలీలు కొంత మంది చెట్ల కింద తలదాచుకోగా.. చెట్ల కింద పిడుగులు పడుతాయనే ఉద్దేశంతో వర్షంలోనే ఒకే దగ్గర నిల్చున్న సుంకరి సైదమ్మ(45), గాజుల వీరమ్మ(55), సుంకరి లక్ష్మమ్మలపై అకస్మాత్తుగా పిడుగుపడింది. ఈ ఘటనలో సైదమ్మ, వీరమ్మ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన లక్ష్మమ్మను వెంటనే పదర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందడంతో కోడోనిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పదర ఎస్‌ఐ సద్దామ్, ఆర్‌ఐ శేఖర్ పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అమ్రాబాద్ ఆస్పత్రికి తరలించారు.



వీరమ్మ మృతదేహం



సైదమ్మ (ఫైల్)

గేదెలు మేపుతుండగా..



వెంకటేశ్వర్లు (ఫైల్)

మానవపాడు: పిడుగుపాటుకు వ్యక్తి మృతిచెందిన సంఘటన గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ చిన్న వెంకటేశ్వర్లు(41) గేదెలను మేపేందుకు గురువారం వెళ్లాడు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవగా అదే సమయంలో పిడుగు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య లక్ష్మీదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ చంద్రకాంత్‌ను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

బుడమొర్సులో మరొకరు..



మహేంద్ర (ఫైల్)

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు గ్రామానికి చెందిన మాదిగ రాజు, తిమ్మక్కల చిన్న కుమారుడు మహేంద్ర(21) గురువారం గేదెలు మేపడానికి తుంగభద్ర నదీతీరానికి వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు మహేంద్ర సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గేదెలు ఇంటికి వచ్చినా మహేంద్ర రాకపోవడంతో కుంటుంబ సభ్యులు తుంగభద్ర నదీతీరానికి వెళ్లి చూడగా విగతజీవుడై కనిపించడంతో బోరున విలపించారు.

అసలేం జరుగుతోంది..?

అడిషనల్ డీఆర్‌డీఓ తీరుపై ఇంటెలిజెన్స్ ఆరా

- సెర్ప్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతలు విచారణ
- అద్దె కారు పేరిట బిల్లులు వసూలు చేస్తున్న వైనం
- వేధింపులు భరించలేమని మహిళా ఉద్యోగినులు ఆందోళన
- అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు



నారాయణపేట: అడిషనల్ డీఆర్‌డీఓ వ్యవహారశైలి.. ఆయన పనితీరు.. మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు రావడం.. మొత్తంగా జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఓ కార్యాలయంలో అసలేం జరుగుతుంది అంటూ.. ఇటు ప్రభుత్వ యంత్రాంగం, సెర్ప్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట శాఖ.. అటు ఇంటెలిజెన్స్ శాఖ ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఈమేరకు చర్యలు తీసుకోవాలంటూ సెర్ప్ ఉద్యోగులు డీఆర్‌డీఓ పీడీ మొగులప్పతోపాటు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి ఫిర్యాదు చేయగా.. పూర్తి వివరాలతో 'మహిళా ఉద్యోగులు హడల్' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమవగా జిల్లాలో సంచలనంగా మారింది. అడిషనల్ డీఆర్‌డీఓను జిల్లా నుంచి పంపించాలని మహిళా ఉద్యోగులు ఉన్నతాధికారులను కోరారు.



సెల్ఫ్ డ్రైవింగ్ చేస్తూ సొంత కారులో వెళ్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ

అన్ని కోణాల్లో ఆరా..

అడిషనల్ డీఆర్‌డీఓ తీరుపై ఇంటిజెన్స్ శాఖ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారి నారాయణపేట డీఆర్‌డీఓ కార్యాలయంలో అడిషనల్ డీఆర్‌డీఓగా విధుల్లో చేరినప్పటి నుంచి ఇంత వరకు ఎంత మంది మహిళా ఉద్యోగులను వేధించారు, ఆయన వేధింపులకు ఎవరైనా మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడ్డారా అనే దానిపై లోతుగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు అవినీతి అక్రమాలకు తావిచ్చారనే కోణంలో సైతం ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇతడిపై సెర్ప్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతలు సైతం విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. అసలు ఆ అధికారి ఎందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు అనే దానిపై పూర్తి వివరాలను తమకు పంపించాలని.. ఎట్టి పరిస్థితుల్లో అతడిని వదులొద్దని.. ఇంతకుముందే సిరిసిల్లలో జరిగిన ఘటనలే ఉదాహరణగా ఉన్నాయని చెప్పినట్లు తెలుస్తోంది.

వేధింపులు భరించలేం..

ఇదిలాఉండగా, పలువురు సెర్ప్ మహిళా ఉద్యోగినులు గురువారం 'సాక్షి' తో మాట్లాడుతూ.. ఆయన వేధింపులను మాటల్లో చెప్పలేమంటూ మనోవేదన చెందారు. నారాయణపేట ఎంఎంఎస్‌లో విధులు నిర్వర్తించిన ఓ మహిళ ఉద్యోగిని.. మీ భర్త అక్కడ ఉంటారు, ఒంటరిగా ఉండి మీరేం చేస్తారంటూ పలు మార్లు వేధించారని కన్నీరుమున్నీరైంది. అలాగే, గూగూల్ మీట్‌లో ఉద్యోగినులతో మాట్లాడే మాటలు.. మా నోటితో చెప్పలేమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మక్తల్ నియోజకవర్గంలో విధులు నిర్వర్తించే ఓ మహిళా ఉద్యోగినిని తోటి ఉద్యోగి బైక్‌పై ఎక్కించుకొని రాగా.. అది చూసిన సదరు అధికారి జుగుప్సాకరమైన మాటలు అన్నాడని సమాచారం. ఆ వెంటనే సదరు మహిళ.. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే మీ అంతు చూస్తా అంటూ గొంతెత్తడంతో అధికారి మిన్నకుండా పోయాడని తెలిసింది. మరో విషయానికి వస్తే.. నేను ఆ మేడమ్‌తో పర్సనల్‌గా మాట్లాడాలి, నువ్వు బయటికి వెళ్లు.. అంటూ ఓ దివ్యాంగ ఉద్యోగిని తరచూ బయటికి పంపిస్తూ వేధింపులకు గురిచేసేవాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

అద్దె కార్ల పేరుతో అక్రమాలు

అడిషనల్ డీఆర్‌డీఓ విధి నిర్వహణకు ఓ అద్దె కారును తీసుకొని జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ చేసేందుకు ప్రభుత్వం నెలకు రూ.33 వేలు చెల్లిస్తోంది. కాగా సదరు అధికారి మాత్రం జిల్లాలోని డీపీఎంల కారుల్లో తిరుగుతూ.. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కారు పేరిట నెలకు రూ. 33 వేలు బిల్లులు డ్రా చేస్తున్నట్లు సమాచారం. అయితే గతేడాది నుంచి వాహనం బిల్లు చెల్లించాలని ఉన్నతాధికారులకు కోరగా ఇటీవల ఏడాదికి సంబంధించిన బిల్లు చెక్ రేడీ అయినట్లు తెలుస్తోంది. అడిషనల్ పీడీపై ఫిర్యాదు రావడంతో ఆ బిల్లు సైతం ఆగినట్లు సమాచారం.



కరీంనగర్‌కు చెందిన జీల కాంతయ్య పేరిట ఉన్న అకౌంట్ పుస్తకం

చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

సెర్ప్ ఉద్యోగులు అందరూ గురువారం అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ వ్యవహర తీరుపై ఫిర్యాదు చేశారు. వెంటనే అ అధికారిపై చట్టరిత్యా, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరగా.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు.



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- తనిఖీ చేసి.. ఫేక్ మెసేజ్ అని తేల్చిన పోలీసులు

నాగర్‌కర్నూల్: జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు మెసేజ్ రావడం కలకలం రేగింది. గురు వారం ఉదయం 7:24 గంటలకు జిల్లా కలెక్టర్ మెయిల్‌కు ఈడీ బేస్డ్ పైప్ బాంబ్‌తో సాయంత్రం 3.20 గంటలకు కలెక్టర్ కార్యాలయాన్ని పేల్చేస్తామని మెసేజ్ వచ్చింది. ప్రతి రోజు ఉద్యోగులు వచ్చిన వెంటనే కలెక్టర్‌కు వచ్చిన మెయిల్స్ చెక్ చేయడం సర్వసాధారణం. కాగా గురువారం వచ్చిన ఈ బెదిరింపు మెసేజ్‌ను గమనించిన సెక్షన్ ఉద్యోగులు విషయాన్ని కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అప్రమత్తమైన ఏఓ ఈ విషయాన్ని ఉదయం 11 గంటలకు ఎస్పీ వైభవ్ గైక్వాడ్, అదనపు ఎస్పీ రామేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్యలు బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో అక్కడికి చేరుకొని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. బాంబుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్లు లేకపోవడంతో ఫేక్ మెసేజ్‌గా పోలీసులు తేల్చారు. అయితే ముప్పల లక్ష్మణ్‌రావు పేరుతో వచ్చిన ఈ మెసే జ్ చివరి అల్లాహూ అక్బర్ అని రాయడం గమ నార్హం. బాంబు బెదిరింపు రావడంతో ఉద్యోగులు సైతం బయటికి వెళ్లిపోయారు. ఇది ఫేక్ మెసేజ్ అని, మెయిల్ ఐడీ ఐపీ అడ్రస్ కోసం ఐటీ సిబ్బంది ద్వారా విచారణ చేస్తున్నామనిడీఎస్పీ శ్రీనివాసులు వివరించారు.



కలెక్టరేట్‌లో తనిఖీలు చేపడుతున్న బాంబుస్క్వాడ్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- వరి ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ఇది సీఎం జిల్లా.. అధికారులంతా సమన్వయంతో పని చేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో వరి ధాన్యం (సన్న రకం) కొనుగోలుకు సంబంధించి క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వరి ధాన్యం కొనుగోలుపై గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో నిర్వాహకులు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, సన్నాలకు బదులు దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వరి ధాన్యం కొనుగోళ్ల అంశాన్ని సంబంధిత శాఖల అధికారులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో, రూల్స్, గైడ్ లైన్స్ ను అందరూ అమలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సన్న రకం వడ్లు దొడ్డు రకం వడ్లు వేర్వేరు కౌంటర్లలో కొనుగోలు చేసి, వేరు వేరు రిజిస్టర్ లలో నమోదు చేయాలని తెలిపారు.

కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ఫ్లెక్సీలు, తేమను కొలిచే యంత్రాలు, రిజిస్టర్లు, ముఖ్యంగా ట్యాబ్ లను సిద్ధం చేసుకోవాలన్నారు. కేంద్రంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా వడ్లు కొనుగోలు చేయాలని ఆమె పునరుద్ఘాటించారు. గతేడాది ట్రాన్స్‌పోర్ట్ పరంగా సమస్యలు ఎదురైనట్లు తన దృష్టికి వచ్చిందని, ఈసారి అలాంటి సమస్యలు ఏమి లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టులలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులకు ఆమె సూచించారు. డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.500 బోనస్‌ను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తే తేమశాతం పరిశీలించిన తర్వాత నిర్వాహకులు గన్ని బ్యాగులను ఇస్తారని, అక్కడే తూకాలు చేయిస్తారని చెప్పారు. డీఏఓ జాన్ సుధాకర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సైదులు, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీఓ మేఘా గాంధీ, డీఆర్డీఓ మొగులప్ప తమ తమ శాఖలకు సంబంధించిన విషయాల గురించి వివరించారు. ఆర్డీఓ రామచందర్ నాయక్, డీసీఓ శంకరా చారి,డీఎంఓ బాలామణి, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికి 'రాజీవ్ యువ వికాసం'

రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు ద్వారా జిల్లాలో నిరుద్యోగం తగ్గుతుందన్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలన్నింటినీ మున్సిపల్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలన్నారు. మండలాల వారీగా ఇప్పటివరకు ఎన్నెన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఏ ఏ దశల్లో ఉన్నాయని హౌసింగ్ అధికారులతో ఆరా తీశారు.

అర్హులందరికీ సన్న బియ్యం పంపిణీ

నర్వ: అర్హులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని, అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సన్నబియ్యం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చౌకధర దుకాణాల్లో సన్నబియ్యాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటికే నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో ఈ నెల 2న పథకాన్ని ప్రారంభించారన్నారు. జిల్లాలో డైనమిక్ రిజిస్టర్ ఆధారంగా అర్హులందరికి సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనువాసులు, ఎంపీఓ రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, డీలర్ జలంధర్ పాల్గొన్నారు. ఇదిలాఉండగా, పాథర్చేడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-3 ఇరుకైన గదులలో ఉండడంతో వెంటనే మార్చాలని ఎంపీడీఓ శ్రీనువాసులుకు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

నేడు గద్వాలకు డీజీపీ రాక

గద్వాల క్రైం/ధరూరు: రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం జిల్లాకు రానున్నారు. నడిగడ్డలో శాంతిభద్రతలు.. విపత్కర కేసులపై ప్రత్యేక సమావేశం నిర్వహించడంతోపాటు కేసుల పురోగతిపై ఆరా తీయనున్నారు. అలాగే ధరూరులోని నూతన పోలీసు స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేయగా.. ఈ నిర్మాణానికి రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉదయం 10.30 గంటలకు భూమి పూజ చేయనున్నారు. ఇదిలా ఉండగా, గురువారం డీఎస్పీ మొగులయ్య, సీఐ శ్రీను తదితరులు ధరూర్ పోలీస్ స్టేషన్‌నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. డీజీపీ రాక నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

క్లుప్తంగా

హార్వెస్టర్‌లో పడి బాలుడు దుర్మరణం


జీవన్‌కుమార్ (ఫైల్)

మల్దకల్: పంట పొలంలో మొక్కజొన్న కోసే హార్వెస్టర్‌లో ప్రమాదవశాత్తు ఓ బాలుడు పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని నీలిపల్లికి చెందిన అఖిల, రాజు దంపతుల కొడుకు జీవన్‌కుమార్(7). తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాజు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను కోసేందుకు హార్వెస్టర్ రావడంతో కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. అక్కడ హార్వెస్టర్ డ్రైవర్ సుభాష్‌రెడ్డి మొక్కజొన్న కోసే క్రమంలో అక్కడే ఆడుకుంటున్న జీవన్‌కుమార్‌ను గమనించలేదు. బాలుడు ప్రమాదవశాత్తు పడిపోయాడు. గమనించిన డ్రైవర్ హార్వెస్టర్‌లో పడిన బాలుడిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. అప్పటికే బాలుడు మృతిచెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం


నాగరాజు (ఫైల్)

మల్దకల్: ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అడివిరావల్‌చెర్వులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయ నాగరాజు (34) ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల కడుపునొప్పితో పాటు ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగరాజుకు భార్య జయలక్ష్మి, ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గండేడ్ మండలంలోని కొంరెడ్డి గ్రామానికి చెందిన వెంకటయ్య(58) పొలం పనులు ముగించుకుని రోడ్డు పక్కన నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన గ్రామస్తులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై వెంకటయ్య కుమారుడు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ వైర్లకు నిచ్చెన తాకడంతో..

వనపర్తి రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిమనగుంటపల్లిలో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు.. చిమనగుంటపల్లికి చెందిన శివయ్య(50) శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలోని రామాలయంలో పనులు చేస్తున్నాడు. ఇనుప నిచ్చెనను తీసుకెళ్తున్న క్రమంలో ఆలయంలో వేలాడుతున్న కరెంట్ వైర్లకు నిచ్చెన తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ విషయంపై వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలెందర్‌రెడ్డిని వివరణ కోరగా మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఆలయంలో కరెంటు వైర్లు కిందికి వేలాడుతున్నాయని అధికారులకు గ్రామస్తులు విన్నవించగా కొత్త కరెంటు స్తంభాలు నిలబెట్టారు. కానీ వైర్లు పైకి లాగక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం గుర్తు తెలియని వ్యక్తి(65) మృతిచెందాడు. అచ్చంపేట ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. గత నెల 31న పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని గమనించిన ప్రయాణికులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

రూ.1.50 లక్షలు చోరీ

మక్తల్: గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.50 లక్షలు చోరీ చేసిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి కథనం మేరకు.. మాగనూర్ మండలం నేరెడుగాం గ్రామానికి చెందిన సంకానూర్ నాగప్ప పట్టణంలోని బ్యాంకులో రూ.1.50 లక్షలు డ్రా చేసుకొని తన సొంత ద్విచక్ర వాహనం పెట్రోల్ ట్యాంకు కవరులో పెట్టాడు. పక్కనే ఉన్న జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి వచ్చేలోగా డబ్బులు కనిపించపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎదురుచూపులే..

అద్దె వాహనదారులకు అందని బిల్లులు


పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ సృజనకు వినతిపత్రం సమర్పిస్తున్న, ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ నాయకులు (ఫైల్)

- రూ.40 లక్షలకు పైగా పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న వాహన యజమానులు
- సొంత వాహనాలను వాడుతున్న పలువురు అధికారులు
- ఉపాధి కోల్పోతున్న యువత


హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణిలో బిల్లు కోసం వినతిపత్రం సమర్పించిన యూనియన్ నాయకులు(ఫైల్)

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వివిధ ప్రభుత్వ శాఖల్లో నడుస్తున్న అద్దె వాహనదారులకు బిల్లుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి కావడంతో తమకు బిల్లులు రావేమోననే ఆందోళన అద్దె వాహనదారుల్లో నెలకొంది. 12 నెలలుగా వారికి రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారు ఆర్థికంగా నలిగిపోతున్నారు. బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అద్దె వాహనాలను సమకూర్చుకోవాలి..

మండల స్థాయి నుంచి ఆపై స్థాయి అధికారులకు ప్రభుత్వం వాహన సౌకర్యం కల్పిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దె వాహనాలను సమకూర్చుకోవాలి. దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వం ప్రతి నెలా ఒక్కో వాహనానికి రూ.33 వేలు చెల్లిస్తుంది. ఇదిలా ఉండగా చాలా మంది అధికారులు అద్దె వాహనాల స్థానంలో తమ సొంత వాహనాలను వాడుకుంటూ అడ్డదారిలో బిల్లులు నొక్కేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అలా చేయడం ద్వారా ఎంతో యువత ఉపాధిని కోల్పోతున్నారు. కొందరికే ప్రభుత్వ అధికారుల వద్ద వాహనాలు పెట్టుకునే అవకాశం దొరుకుతోంది. వారికి సైతం బిల్లులు సకాలంలో రావడం లేదు.

సొంత పనులకు ఈ వాహనాలే దిక్కు..

కేవలం ప్రభుత్వ కార్యకలాపాలకు మాత్రమే ఉపయోగించాల్సిన వాహనాలను కొంత మంది అధికారులు సొంత పనులకు సైతం వాడుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఇది ఏమిటని ప్రశ్నించలేని పరిస్థితి నెలకొందని, ప్రశ్నిస్తే తమ వాహనాలను తొలగిస్తారేమోనని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం వాహనదారులకు సుమారుగా రూ. 40 లక్షల దాకా బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు చెల్లించాలని ఇటీవల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజనను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఎన్నో నెలల నుంచి పెండింగ్..

నిబంధనల ప్రకారం నిరుద్యోగులు ఆయా సంక్షేమ శాఖల ద్వారా కొనుగోలు చేసే వాహనాలను ప్రభుత్వ అధికారుల వద్ద అద్దెకు పెట్టుకోవాలి. ఇలా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో మండల, డివిజన్, జిల్లా అధికారుల వద్ద దాదాపు 150 వరకు వాహనాలు నడుస్తున్నాయి. వాటికి సంబంధించి 15 నెలలుగా బిల్లులు రావడం లేదని వాహనాల యజమానులు చెబుతున్నారు.

⇨ జిల్లాకు సంబంధించి రూ.40 లక్షలకు పైగా ఉన్న బకాయిలు విడుదల కావాల్సి ఉంది. డీఆర్‌డీఓ శాఖలో 26 నెలలు, సమాచార పౌర సరఫరాల శాఖ 9 నెలలు, మత్స్య శాఖ 4 నెలలు, గిరిజన సంక్షేమ శాఖ 24 నెలల నుంచి, జిల్లా పరిశ్రమల 5 నెలలు, ఆర్‌అండ్‌బీ 12 నెలలు, ఇరిగేషన్ 10 నెలలు, హెల్త్ డిపార్ట్‌మెంట్ 10 నెలలు, ఎస్సీ అభివృద్ధి శాఖలో ఏకంగా 34 నెలలు, మిషన్‌భగీరథ (ఇంట్రా) లో 16నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో కూడా నెలల తరబడి బిల్లులు రాక అద్దెవాహనదారులు ఇబ్బందులు పతున్నారు.

ఇళ్లకు పోలేకపోతున్నాం..



నెలల తరబడి బిల్లులు రాలేకపోవడంతో ఇళ్లకు పోలేకపోతున్నాం. అధికారులను ఎన్ని సార్లు కలిసినా బిల్లులు చేశామని చెబుతున్నారే తప్ప బిల్లులు మాత్రం రావడం లేదు. రెండు మూడు నెలలంటే ఏమో కాని 12, 15 నెలల నుంచి బిల్లులు రాకుంటే ఎట్ల బతకాలి. ఉన్నతాధికారులు చొరవ చూపి జిల్లా వ్యాప్తంగా ఉన్న బిల్లులను వెంటనే చేయించాలి.

– అబ్దుల్ ఖాదర్, జిల్లా అధ్యక్షుడు, ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్, మహబూబ్‌నగర్

వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేదు



బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోయింది. రెండేళ్ల నుంచి బిల్లులు రాకుంటే బతికేది ఎలా.

– సయ్యద్ సలీం హుసేనీ, కార్యవర్గ సభ్యుడు, మహబూబ్‌నగర్

దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాం



పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. బిల్లులు నెల నెల రాక పోవడంతో వాహనాలు నడిపేందుకు అప్పులు చేస్తున్నాం. నెలల తరబడి వాహనాలకు చెందిన బిల్లులు రాకపోవడంతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాం.

–ధర్మానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి

34 నెలలుగా పెండింగ్...



నా వాహనానికి చెందిన 34 నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క నెల బిల్లు రాకపోతేనే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏకంగా 34 నెలలుగా బిల్లులు రాకపోతే మేము ఎలా జీవించాలి. అధికారులు స్పందించి నా తోపాటు పెండింగ్‌లో ఉన్న వాహనదారులు బిల్లులను వెంటనే చెల్లించాలి.

– నిరంజన్, వాహనదారుడు

16 నెలలుగా పెండింగ్‌లో బిల్లులు...



నా వాహనం మిషన్ భగీరథ శాఖలో నడుస్తుంది. 16 నెలలకు చెందిన బిల్లులు రావాల్సి ఉంది. ఏమిటని ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారోచేసుకోండని అధికారులు తేల్చి చెబుతున్నారు. మీరు కాకుంటే వేరే వాళ్ల వాహనం పెట్టుకుంటామని బెదిరిస్తున్నారు.

– చెన్నయ్య, వాహనదారుడు

డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు
భూమి కేటాయించాలి


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్

పాలమూరు: మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయడానికి భూమి కేటాయించడంతో పాటు భవనం నిర్మాణానికి సహకరించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఎలాంటి లాభాపేక్ష లేకుండా అపత్కాలంలో పేదలకు సేవ చేస్తున్న రెడ్‌క్రాస్‌కు డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల పేదలకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ డయాగ్నొస్టిక్ సెంటర్ ఆధునాతన భవన నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయింపు చేయడానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

జీపీఓలు అభద్రతకు గురికావొద్దు


మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఆప్షన్ల ద్వారా రెవెన్యూశాఖలోకి వస్తున్న జీపీఓ (గ్రామ పరిపాలన అధికారి)లు సర్వీసుపరమైన అభద్రతకు గురి కావాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఉమ్మడి పాలమూరు జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా నియమిస్తోందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందడంతో పాటు రెవెన్యూ ఉద్యోగులకు భారీఎత్తున పదోన్నతులు ఉంటాయని చెప్పారు. భూ భారతి ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్‌ఏ నుంచి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయన్నారు. జీఓ నంబర్ 317 ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిందని.. ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి, పుట్టకొక్కరికి పోస్టింగ్‌లు ఇచ్చారన్నారు. పదేళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్ సోర్సింగ్ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, నారాయణపేట అడిషనల్ కలెక్టర్ బెంజ్‌శాలం, ఆర్డీఓ నవీన్, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, రాములు, రమేష్ పాక, రాంరెడ్డి, బిక్షం, రాధ, పాల్ సింగ్, ఉపేందర్‌రావు, డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమలకు ఎంఎస్ ఎంఈలు సహకరిస్తాయి

పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి


కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కొత్త పరిశ్రమలకు ఎంఎస్ఎంఈ(మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్)లు ఎంతో సహకరిస్తాయని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్థికవృద్ధిలో చిన్న, మధ్య తరహా పరిశ్రమ పాత్ర అవకాశాలు మరియు సవాళ్లు' అనే అంశంపై ఏర్పాటు చేసిన ఒక్కరోజు జాతీయ సెమినార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈలు ఉపాధి కేంద్రాలుగా వ్యవహరించొవచ్చన్నారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుపై విద్యార్థి దశ నుంచి పూర్తిస్థాయిలో అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ఉద్యోగం కోసం వేచి చూడకుండా ఎంఎస్ఎంఈలలో ఒక పరిశ్రమను స్థాపించడంతో పలువురికి ఉపాధి అవకాశాలు కలిప్ంచవచ్చన్నారు. అనంతపూర్ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు కేశవరెడ్డి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ట్రైనర్ సుధీర్, మంజుల, కల్వకోల్ భాస్కర్, నాగరాజు, వినోద్‌కుమార్, ఆరీఫ్ పాల్గొన్నారు.

బంగారు దుకాణంలో చోరీ

కొత్తకోట రూరల్: పట్టణంలోని హనుమాన్ జ్యువెలరీ దుకాణంలో మహిళలు చోరీకి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. దుకాణ యజమాని మధ్యాహ్న భోజనానికి వెళ్లగా అందులో పనిచేసే అబ్బాయి ఒక్కడే ఉన్నాడు. దీనిని గమనించిన ఐదుగురు మహిళలు దుకాణంలోకి వచ్చి బంగారు వస్తువులు చూపాలంటూ మాటల్లో పెట్టగా.. అందులో ఓ యువతి బంగారు బిస్కెట్‌ను దొంగిలించింది. యజమాని వచ్చిన తర్వాత ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి వచ్చి బిస్కెట్ కావాలని అడగగా కనిపించకపోవడంతో అవాక్కై వెంటనే సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. వచ్చిన వారిలో ఓ యువతి బంగారు బిస్కెట్ దొంగిలించిందని నిర్ధారించుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బిస్కెట్ 6 తులాల బరువు ఉంటుందని, దాని విలువ సుమారు రూ.5 లక్షలని యజమాని వివరించారు.

సహాయక చర్యలు వేగవంతం


సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

- ఎస్‌ఎల్‌బీసీలో కార్మికుల కోసం 41 రోజులుగా గాలింపు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో ప్రమాదం జరిగి 41 రోజులు అవుతున్నా.. ఇంకా ఆరుగురు కార్మికుల జాడ లభించలేదు. ప్రమాదంలో రూ.కోట్ల విలువైన టీబీఎం ధ్వంసం కావడంతో పాటు ఎనిమిది మంది కార్మికులు గల్లంతయ్యారు. ఇప్పటి వరకు ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ కనుగొనేందుకు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. కన్వేయర్ బెల్టు పొడిగింపు, వెంటిలేషన్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఆర్మీకి చెందిన బాబ్‌కాట్ మెషిన్లు, నాలుగు ఎస్కవేటర్లతో మట్టిని తొలగించి కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నారు. నిమిషానికి 10 వేల లీటర్ల నీటి ఊటను 150 హెచ్‌పీ మోటార్ల సాయంతో బయటకు పంపుతున్నారు.

15 రోజుల్లో పూర్తయ్యేనా..

సొరంగంలో కూరుకుపోయిన టీబీఎం శకలాలు, మట్టి, బురద, రాళ్లు ఇతర శిథిలాల తొలగింపు 15 రోజుల్లో పూర్తవుతుందని ప్రభుత్వం గడువు విధించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 560 మంది సహాయక సిబ్బంది మూడు, ఐదు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. అత్యంత క్లిష్టమైన డీ1, డీ2 ప్రదేశంలోని 30 మీటర్ల వరకు శిథిలాలను తొలగించారు. మరో 110 మీటర్ల మేర మట్టి, బురద, రాళ్లను తొలగిస్తే కార్మికుల ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉందని సహాయక సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తవడం గగనమే అనిపిస్తోంది.

రైతన్న తీన్‌మార్.. పక్షులు పరార్



పక్షుల బారి నుంచి గింజ దశలో ఉన్న వరిపంటను కాపాడుకునేందుకు రైతు రాముడు వినూత్నంగా ప్రయత్నించాడు. బ్యాండుమేళాలో ఉపయోగించే తాసెను మెడకు వేసుకుని పొలం చుట్టూ తిరుగుతూ తీన్‌మార్ మోత మోగించడంతో వరి ధాన్యం కోసం వచ్చిన పక్షులు తుర్రుమంటూ పలాయనం చిత్తగిస్తున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని కొండేరు శివారులో గురువారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– ఎర్రవల్లి

జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్


మాట్లాడుతున్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఆరు దశాబ్దాలుగా బీసీలు పోరాడుతున్నా కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీని సీఎంని చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. బీసీ జాగృతి సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, నాయకులు తిరుమలేష్, అంజిలప్ప, రవి, తిమ్మయ్య పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లింపు


ప్రమాదానికి గురైన లారీ

మహబూబ్‌నగర్ క్రైం: దివిటిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం లారీ డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు అడ్డుగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దివిటిపల్లి దగ్గర బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో వాహనాలు ఒక వైపు నుంచి పంపిస్తున్నారు. ఈక్రమంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బ్రిడ్జి సమీపంలో డివైడర్‌కు ఢీకొట్టి రోడ్డుకు అడ్డుగా నిలిచిపోయింది. దీంతో పోలీసులు దాదాపు రెండు గంటల పాటు కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను భూత్పూర్ బ్రిడ్జి దగ్గర దారి మళ్లించారు. మహబూబ్‌నగర్ బైపాస్ మీదుగా జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు డైవర్షన్ చేశారు. దీంతో భూత్పూర్ నుంచి బైపాస్ మీదుగా వాహనాలు అధికంగా రావడంతో మహబూబ్‌నగర్ పిస్తాహౌజ్ సమీపంలో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. దాదాపు రెండు గంటల తర్వాత రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీ తొలగించడంతో వాహనాలను జాతీయ రహదారిపై అనుమతి ఇచ్చారు.

తలుపులు పగలగొట్టి ఇంట్లో చోరీ

వెల్దండ: మండలంలోని చల్లపల్లికి చెందిన బండ్ల రాములు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి బంగారం అభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్ల రాములు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో ఇల్లు కట్టుకొని అక్కడే నివాసం ఉంటున్నాడు. చల్లపల్లిలో బుధవారం రాత్రి సోదరుడి ఎంగేజ్మెంట్ ఉండడంతో వెళ్లి, అక్కడే భోజనం చేసి తిరిగి అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చారు. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు ధ్వంసం చేసి ఉండడాన్ని చూశారు. ఇంటి లోపలికి వెళ్లి చూడగా.. బంగారు నల్లపూసల దండ, గొట్టాలు, మ్యాట్లీలు కలిపి రెండున్నర తులాల బంగారం, కేజీ వెండి, సుమారు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గురువారం బాధితుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.